# మున్నూరుకాపుల మద్దతు బీఆర్‌ఎస్‌కే..

**మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య**

- ఎల్బీనగర్‌ను హైటెక్ సిటీలా మారుస్తా
- మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డి



ఎల్బీనగర్‌లో నిర్వహించిన మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని జ్ఞాపికలతో సత్కరించిన మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు

ఎల్బీనగర్, నవంబర్ 22: మున్నూరుకాపుల మద్దతు బీఆర్‌ఎస్‌కేనని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య చెప్పారు. మున్నూరుకాపులు నమ్మకానికి ప్రతీకలని, మాట ఇస్తే మడమ తిప్పరని పేర్కొన్నారు. బుధవారం ఇక్కడి ప్రణవి గార్డెన్స్‌లో నిర్వహించిన ఎల్బీనగర్ మున్నూరుకాపుల దసరా, దీపావళి ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు మున్నూరుకాపులు ఇచ్చిన మాట నిలుపుకొంటారని చెప్పారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. మున్నూరుకాపుల డిమాండ్లను తప్పకుండా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఎల్బీనగర్, పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్యం తగ్గించడానికి దేశంలో ఏ నియోజకవర్గంలో లేని విధంగా పార్కులను అభివృద్ధి చేశానని చెప్పారు. హైటెక్ సిటీతో పోటీపడే విధంగా ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. మున్నూరుకాపు సామాజికవర్గం అండదండలు అందించి తనను మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ పుటం పురుషోత్తంరావు, ఉపాధ్యక్షులు రామారావు పటేల్, మల్యాల మదన్‌పటేల్, అరుణాపటేల్, మాజీ కౌన్సిలర్ త్రివేది, నేతలు తోట రాజుపటేల్, అనంతుల నవీన్‌కుమార్, ఎక్క రమేశ్‌పటేల్, ఆవుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వస్తే 3 గంటల కరెంటే..

- అభివృద్ధి ఆగమైతది.. సంక్షోభంలో సంక్షేమం
- పేదలకు అండగా గులాబీ జెండా
- మంత్రి చామకూర మల్లారెడ్డి



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మంత్రి చామకూర మల్లారెడ్డి

మేడ్చల్/ శామీర్‌పేట, నవంబర్ 22 : కాంగ్రెస్ వస్తే 3 గంటల కరెంటే దిక్కవుతుందని.. వ్యవసాయం దెబ్బతింటుందని, అభివృద్ధి ఆగిపోతుందని మంత్రి, మేడ్చల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం శామీర్‌పేట మండలంలోని ఆలియాబాద్, లాల్‌గడీమలక్‌పేట, మజీద్‌పూర్, యాడారం, బాబాగూడ, పొన్నాల, బొమ్మరాశిపేట, కొల్తూర్, తుర్కపల్లి, మురహరి గ్రామాల్లో కార్నర్ మీటింగ్‌లో మంత్రి పాల్గొని మాట్లాడారు. పదేండ్ల పాలనలో బీఆర్‌ఎస్ తెలంగాణను ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. కాంగ్రెస్ నేతలు వ్యవసాయం పై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, 3 గంటల కరెంట్‌తో పంటలు పండుతాయా.. అని మంత్రి ప్రశ్నించారు. పేదలకు అండగా నిలిచేది గులాబీ జెండా ఒక్కటేనన్నారు. హామీలను అమలు చేసే సత్తా కేసీఆర్‌కే ఉందన్నారు. కారు గుర్తుకు ఓటేసి, బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లుబాయి, జడ్పీటీసీ అనితాలాలయ్య, వైఎస్ ఎంపీపీ సుజాత, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జహంగీర్, మాజీ ఎంపీపీ సీతారాములు గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుదర్శన్, మల్లేశ్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు సతీశ్ రెడ్డి, అనిల్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు నర్సింహా రెడ్డి, రూరల్ అధ్యక్షుడు నీరజ్ గౌడ్ పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు



టర్నింగ్ పాయింట్ హోటల్ వద్ద ప్రచారం చేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, నవంబర్ 22 : నియోజకవర్గంలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని డిప్యూటీ స్పీకర్, బీఆర్‌ఎస్ పార్టీ సికింద్రాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని సీతాఫల్‌మండి డివిజన్‌లో ప్రచారం చేశారు. డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీ టర్నింగ్ పాయింట్ హోటల్ వద్ద నుంచి ప్రచారం ప్రారంభించారు. స్థానిక కార్పొరేటర్ హేమలతతో పాటు పద్మారావుగౌడ్ తనయులు కిరణ్‌గౌడ్, రామేశ్వర్‌గౌడ్ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ... నియోజకవర్గంలో తమ ఎన్నికల ప్రచార పాదయాత్ర జాతరలా సాగుతుందని, ప్రజలు బ్రహ్మరథం పడుతున్నట్లు తెలిపారు. తాను చేసిన అభివద్ధి పనులే తన గెలుపునకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి అందేలా కృషి చేసినట్లు వివరించారు. నియోజకవర్గ ప్రజలు అభిమానంతో ఎన్నికల ప్రచార పాదయాత్రకు స్వచ్ఛందంగా తరలివచ్చి పాల్గొంటున్నారని వెల్లడించారు.



అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా, అడ్వైజర్ కమిటీ చైర్మన్‌గా గంజి రాజమౌళి గుప్తా నియమితులయ్యారు. నగరంలోని రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్ చేతుల మీదుగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా, గంజి రాజమౌళి గుప్తా నియామక పత్రాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పబ్బ చంద్రశేఖర్, సలహాదారు ముత్యాల సత్తయ్య, ప్రతినిధులు ఉడుత పురుషోత్తం, రొంపల్లి సంతోష్ తదితరులు పాల్గొన్నారు. *–మన్సూరాబాద్, నవంబర్ 22*

## నందకిశోర్ వ్యాస్‌ను గెలిపిస్తే వాడ వాడలా అభివృద్ధి

**చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా**



ధూల్‌పేటలో గోషామహల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్‌తో కలిసి ప్రచారం చేస్తున్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, గోషామహల్ బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి కోలేటి దామోదర్ గుప్తా

అబిడ్స్, నవంబర్ 22 : గోషామహల్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీల్లో ఉన్న నందకిశోర్ వ్యాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, గోషామహల్ బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి కోలేటి దామోదర్ గుప్తా ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గోషామహల్ నియోజకవర్గం మంగళ్‌హాట్ డివిజన్ పరిధిలోని ధూల్‌పేట ప్రాంతంలో ఆయన, పార్టీ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరి సింగ్, ఆనంద్‌సింగ్, అభ్యర్థి సతీమణి ఉమాదేవి వ్యాస్, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటా తిరిగి ప్రచారాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మతం పేరుతో ఓట్ల రాజకీయానికి పాల్పడుతూ.. అభివృద్ధిని పూర్తిగా విస్మరించిన బీజేపీ అభ్యర్థిని ఈ ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడించి బీఆర్‌ఎస్ పార్టీకి పట్టం కట్టడం ఖాయమన్నారు. గోషామహల్‌లో బీఆర్‌ఎస్ విజయాన్ని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకు నియోజకవర్గం వ్యాప్తంగా ఆరుగురు ఎన్నికల ఇన్‌చార్జిలను నియమించారని, పూర్తిస్థాయిలో ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజల్లో బీజేపీ అభ్యర్థి పట్ల తీవ్ర వ్యతిరేకత ఉన్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అభినందిస్తూ.. బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలుపిస్తామని ప్రజలు స్పష్టం చేయడం శుభపరిణామమన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ మాట్లాడుతూ.. కరోనా సమయంలో ధూల్‌పేటలో ప్రతి ఇంటికి నిత్యావసర వస్తువులను అందజేశానన్నారు. ఇక్కడి పేద ప్రజలకు ఏ అవసరం వచ్చినా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తూ ఆదుకుంటున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పరమేశ్వరిసింగ్, ఆనంద్‌సింగ్, శ్రీనివాస్ యాదవ్, బల్‌దీప్‌సింగ్, హెచ్. కుమార్, రాజేందర్ సింగ్, నవనీత, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## భవానీనగర్ సమస్యలు పరిష్కరిస్తా..

**కాలనీవాసులతో బీఎల్ఆర్ సమావేశం**



భవానీనగర్‌కాలనీ వాసులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బండారి లక్ష్మారెడ్డి

కాప్రా, నవంబర్ 22: భవానీనగర్‌కాలనీ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటానని ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఏఎస్‌రావునగర్ డివిజన్ భవానీనగర్ కాలనీవాసులతో జరిగిన సమావేశానికి బీఎల్‌ఆర్ ముఖ్యఅతిథిగా హాజరు కాగా.. కాలనీకి సంబంధించిన పలు సమస్యలను వారు ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రామారావు, ధనసాగర్‌రెడ్డి, విజయ్‌గౌడ్, రెడ్డప్పరెడ్డి, రవీందర్, జ్ఞానేశ్వర్, దేవదాస్, శంకర్‌బాబు పాల్గొన్నారు.

## ఎన్సీఈఆర్టీ ప్యానల్ సూచనలు తప్పు

**సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ**

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): హైస్కూల్ స్థాయి పాఠ్యాంశాల్లో రామాయణం, మహాభారతం చేర్చాలని ఎన్సీఈఆర్టీ ప్యానల్ సూచించడం సరికాదని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ పేర్కొన్నారు. విద్యావ్యవస్థలోకి మతాన్ని తీసుకురావడం ఏంటని ప్రశ్నించారు. సామాజిక శాస్త్రాలు, చరిత్ర పాఠాల్లో రామాయణం, మహాభారతం చేర్చాలనే ప్రయత్నాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను మనుధర్మం శాస్త్రం దిశగా మార్చేందుకే జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చిందని ఆరోపించారు. దానికి అనుగుణంగానే ఎన్సీఈఆర్టీ సిలబస్ మారుస్తున్నదని తెలిపారు. దేశభక్తి లేకనే విద్యార్థులు విదేశాలకు వెళ్లిపోతున్నారనడం అవగాహనరాహిత్యమని పేర్కొన్నారు. ఇక్కడ అవకాశాలు లేకనే విద్యార్థులు విదేశాలకు వెళ్తున్నారని నారాయణ స్పష్టం చేశారు. ఇండియాకు బదులుగా భారత్ అనే పేరును పాఠ్యాంశాలలో చేర్చాలనే సూచనను కూడా తప్పుబట్టారు. విద్యా వ్యవస్థలో కీలక స్థానాలైన యూజీసీ చైర్మన్ జగదీశ్, ఎన్సీఈఆర్టీ ప్యానల్ మెంబర్ ఇసాక్ వంటి వారంతా ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్నవారేనని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ ఆదేశాలకు అనుగుణంగానే వారు చరిత్రను మార్చేందుకు ప్రణాళికాబద్ధంగా కుట్రలో భాగం అవుతున్నారని నారాయణ మండిపడ్డారు.

## మైనార్టీలను మరోసారి మోసగించే కుట్ర

**టీఎస్ ఫుడ్స్ చైర్మన్ రాజీవ్‌సాగర్ ధ్వజం**

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): మైనార్టీ సమాజాన్ని మరోసారి మోసగించడానికే కాంగ్రెస్ పార్టీ దొంగ డిక్లరేషన్లు చేస్తున్నదని టీఎస్ ఫుడ్స్ చైర్మన్ మేడె రాజీవ్‌సాగర్ ఆరోపించారు. క్రైస్తవ సమాజాభివృద్ధికి సీఎం కేసీఆర్ చేస్తున్న కృషికి యావత్ సమాజం అండగా నిలవాలని పిలుపునిచ్చారు. నమ్మినానబోస్తే పుచ్చి బుర్రలైనట్టు.. 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఏనాడూ క్రిస్టియన్లను పట్టించుకోలేదని విమర్శించారు. ఎన్నికలు రావడంతో దొంగ డిక్లరేషన్లతో మరోసారి ప్రజలను మోసం చేయాలని కాంగ్రెస్ పార్టీ చూస్తున్నదని బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు కానీ హామీలను తెలంగాణలో ఎలా అమలుచేస్తారని ఆయన ప్రశ్నించారు. సెక్యులర్ పార్టీ అని చెప్పుకొనే కాంగ్రెస్.. అధికారంలో ఉన్న పదేండ్లకాలంలో మైనార్టీల కోసం రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చుచేసిందని, అదే సీఎం కేసీఆర్ సర్కారు తొమ్మిదిన్నరేండ్లలోనే రూ.12 వేల కోట్లు ఖర్చుచేసి మైనార్టీ సంక్షేమానికి పాటుపడిందని గుర్తుచేశారు.

## ఎస్‌బీఐ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీధర్

**సన్మానించిన బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు**

సిటీబ్యూరో, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ) : స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ స్టాఫ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా సీహెచ్. శ్రీధర్ ఎన్నికయ్యారు. బుధవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను వృత్తి ధర్మాన్ని, నాయకత్వ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి, కార్మికుల, ఉద్యోగుల మన్ననలు పొందడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలు జిల్లాలకు చెందిన సంఘం నాయకులు శాలువాలు కప్పి, పూల మాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు శ్రీనివాస శర్మ, వైస్ ప్రెసిడెంట్ హెడ్ క్వాటర్స్ సంధ్య, మల్లికార్జున రెడ్డి, ట్రెజరర్ డీజీఎస్‌లు ఎం. శ్రీనివాస్, సాండలియా, ఏజీఎస్‌లు, టి.సుమన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.